# బ్రిడ్జి క్రింద రోడ్డు మీద

బ్రిడ్జి క్రింద—

రోడ్డు మీద—

అంకయ్య పడుకున్నాడు

కాలుమీద కాలు వేసుకుని—బీద దొరలాగ,

జోలుతలగడగా

రోడ్డు పరుపుగా—ఒరిగాడు అంకయ్య. బాటసారుల దయకోసం—పెట్టిన సత్తుగిన్నెలో శకటాలు రేపే దుమ్ము రాలుతోంది—

ఆకలి—నీరసం—మసకలు కమ్మిన కళ్ళు సరిగా ముష్టివృత్తి కూడా చేసుకోనివ్వడం లేదు.

అంకయ్య బాధగా మూల్గాడు—గాయకుని గొంతు సవరింపులా.

దోమలు సంగీతం పాడాయి—బృందగానం—ఈగలు నృత్యం చేశాయి.

బ్రిడ్జి గోడమూల దాగొన్న దుర్గంధం వాసనలు చిమ్మింది.

అంకయ్య జాలిగా నవ్వుకున్నాడు తనలో. బ్రిడ్జిమీద నుంచి రైలు కూసింది—పరుగెత్తింది. ఆ పరుగులో బొగ్గుని రాల్చింది అతనిపై పుష్పవృష్టిలా—

రైలుకూత–అతనికి స్వాగతగీతంలా–రైలు గమనం–ప్రేక్షక జనుల సందడిలా–తన జీవితం. ఒక విధంగా గానకచేరీ అంకయ్య జాలిగా తనలో నవ్వుకున్నాడు–పొట్ట బాదుకుని అరుద్ధామనుకున్నాడు–కాని ఓపిక లేదు.

ప్రక్కనే మరొక బిచ్చగాడు–కుంటివాడు–నేస్తంలేదు కాని–తనతో పస్తులపోటీ చేస్తున్నాడని తెలుసు—

తన ఏజెంటులా అతడు అరుస్తున్నాడు

పొట్ట బాదుకుంటూ—

అకలి–ధర్మాత్ములు దయచేయండి–దానం పెబువులు–!!

పైసలు రాలుతున్నాయి–ఆ బిచ్చగాడి గుడ్డమీద–

—పొరపాటున అంకయ్య సత్తు గిన్నెలో–ఆ పొరపాటు దిద్దుతున్నాడు.

ఆ బిచ్చగాడు–సత్తుగిన్నె ఖాళీ చేస్తూ.

అకలి నీరసం – దేహాన్ని దహిస్తోంది – కుష్ఠు వ్యాధి నరాల్ని సడలిస్తోంది–చీము నెత్తురు–వంటిమీద అభరణాల్లా గడ్డ కట్టుకుంటున్నాయి అక్కడక్కడ—

ఒక ముత్తైదువ నడిచింది–కాలి అందెలు ఘల్లుమంటూ శబ్దం—

అంకయ్య ఆలోచనలో పడ్డాడు–ఏదో మనస్సులో మెదలింది–తన భార్య సాధ్వి—

చదువుకురాక – పెడబుద్ధితో – అహంభావంతో చిన్నప్పుడు గడిపిన రోజులు—

తన్ను పెంపు చేసుకోడం–పుష్కలంగా ధనం లభించడం–

ఎన్నో స్త్రీ ఆకారాలు — మారాయి — తర్వాత బలవంతాన వివాహం—తన్ను అభిమానించేది—ఆమెను ద్వేషించేవాడు.

చివరకు ఒక కొడుకు-కూతురు జనించారు—

తర్వాత భార్య ఆరోగ్యం చెడింది-తనవల్లే—

బాధలో కన్నీరు తప్ప పల్లెత్తుమాట అనలేదు—

జాలిగా చూసేది - యిదెబాధ తన్ను ఆవరిస్తే ఎలా సహిస్తున్నారని.

సెగ గడ్డలు ఒంటిమీద ఎర్రట మాటల్లా — బాధతో విషం తిని చనిపోయింది—ఆమె—

పిల్లలను తీసుకుపోయాడు తాత—పెంచి పెద్దచేశాడు వాళ్ళని—

తన్ను గురించి సరైన పాఠం చెప్పాడు—కనిపిస్తే తిరస్కరించారు—

వనలక్ష్మి-వరలక్ష్మి- వెంకటలక్ష్మి-ఎందరో తన లక్ష్మిని పంచుకున్నారు-తనకు దారిద్ర్యం దానం చేసారు- దేహంలో విషపు పురుగులు నింపారు—

కాలాతీత పశ్చాత్తాపం—అకాలవ్యాధి—కుష్టు—సమాజం వెలి—

తప్పనిసరిగా తనీ సమాజాన్ని వెలివేసి తిరిగాడు తిరిగాడు—అనేక ప్రాంతాలు.

అంటిన వ్యాధి—

అంటని చదువు—

జీవితాన్ని ఒంటిచేశాయి-కుంటిచేశాయి-

బాధతో మూల్గాడు అంకయ్య-

భార్యలా విషం తిని చస్తే-

మరో జన్మలో బాధ తప్పదని యీ నమ్మకం-

పూర్తిగా బాధపడి చనిపోతే-వచ్చే జన్మలోనైనా మరొక క్రొత్తదనం-

అంకయ్య జాలిగా మూల్గాడు-

జామిపళ్ళు-జామిపళ్ళు!-కేక!! పిలిచాడు అంకయ్య-

జోలులో తడిమి అణా తీశాడు-రెండు పళ్ళు ఎత్తి రాల్చాడు పండ్లవాడు. కడిగి తీసుకున్నాడు అణా!! కొరికాడు ఒకపండు-ఒకపండు ప్రక్కనపెట్టి-

కొరికినపండు ఎర్రగా ఉంది-

తన శరీరంలా-చీము నెత్తురుతో-

కడుపు నింపుకున్నాడు-

చిటికినవ్రేలు పటుత్వం తప్పింది-రక్తం కారుతోంది-

జోలులోని గుడ్డచింపి కట్టుకట్టాడు. ఆ కట్టుపట్టులో పటుత్వం తప్పిన వెలు ఊడింది-

అంకయ్య కన్నీటి బిందువు ఆ వెలుమీద రాలింది-

ఆ శిలోదకంతో వెలు దూరంగా జారింది-

అంకయ్య అర్థంకాని బాధతో ఒరిగాడు కళ్ళు మూసుకుని-

ఈగలు పరామర్శించాయి-

దోమలు శరీరాన్ని జాలిగా మట్టాయి-కుంటి బిచ్చగాడు రెండుకళ్ళు పెద్దవిచేసి అంకయ్య తలప్రక్కన జామిపండు చూశాడు-

నాలిక చాపాడు- ఒక్క చిటికెలో లాగేడు- ఒక్క గుటకలో తిన్నాడు-

గప్‌చిప్‌గా-ఒక నిమిషం మౌనం-పొట్ట బాదుకున్నాడు- అరిచాడు-ఆకలి! బాబూ! ఆకలి!!

ధర్మపబువులు-దానం-బాబూ!!

కుంటివాడి ఆకలిపాట-అంకయ్యకు జోలపాట అయింది-

నిద్రమైకం-

రోడ్డు మీద దుమ్ము- కలలోని అలలుగా కార్లు-టాంగాలు- వేగంగా-రిక్షాలు మువ్వలతో మురిపింగా పరుగులు తీస్తున్నాయి-

చుట్టుపక్కల పోలీసు లేడు-

తొందర పనులున్నా పెద్దల కార్ల వేగానికి హద్దులేదు-

రోడ్లామలుపులు ఒద్దనలేదు వేగం-నాందిగా అంకయ్య మీద రోడ్డుదుమ్ము దుప్పటి కప్పింది-

ఒక టాంగా-ఒక కారు-ఒక సైకిలురిక్షా వేగంగా ఒకే సారి-ఆ బ్రిడ్జిక్రింద రోడ్డుమీద కలుసుకున్నాయి.

చక్రాలతో కరచాలనం చేసుకున్నాయి-

స్నేహంగాకాదు-కసిగా-

కారు మడ్గారుసొట్ట-

టాంగా చక్రంలోట్ట-

సైకిలురిక్షా పట్టీ-హేండిల్ మొండిగా ఒరిగింది-

చక్రాలు అంకయ్యపై విష్ణుచక్రంలా తిరిగాయి-

బ్రేకులు అతని పొట్టలో గ్రుచ్చుకున్నాయి. జారి నేలమీద పడిన రిక్షావాడు గీసుకుపోయిన చేతులతో దుమ్ము తుడుచుకుని రిక్షా అంకయ్య మీదనుంచి లాగాడు.

చీము నెత్తురు పట్టుకున్న హేండిల్ తుడుచుకున్నాడు. రిక్షావాడు గుడ్డతో అసహ్యంతో-అంకయ్యను తిడుతూ-

టాంగావాడు-కారుడ్రైవరుని తిట్టాడు-

ఆ రణగొణ ధ్వనిలో అంకయ్య ఆఖరి ఊపిరిధ్వని ఎవరికీ వినిపించలేదు-

శకటాలు ఆ బ్రిడ్జిక్రింద రోడ్డు కాళీచేశాయి-

అంకయ్య కాలుమీద కాలు వేసుకుని-బీదదొరలా.

నిశ్చింతగా నిత్యంగా ఒరిగాడు-జోలు తలగడగా రోడ్డు పరుపుగా-

ఆకాశంలో మేఘాలు నల్లగా పరవళ్ళు త్రొక్కుకుంటూ-అంకయ్యను వెతుకుతున్నట్టు పరుగిడుతున్నాయి-

బ్రిడ్జిమీద రైలు ఝుక్ ఝుక్ మంటూ పరుగులు తీసింది.

ఇంజను పొగ గుప్పింది-అంకయ్యపై శోకంలా-

బొగ్గుకణాలు రాల్చింది అతనిపై చితికి నాందిగా-

వానచినుకులు పెద్దవైనాయి-వృష్టి-

బ్రిడ్జిక్రింద – రోడ్డు పల్లం – నీరు నింపుకుంది సరస్సులా – అంకయ్య శరీరం అందులో తేలింది–రోడ్డుక్రింద మురికి సొరంగంలోకి నీరు లాక్కుపోయింది–అంకయ్యను–తేమ రోడ్డుమీద–

బ్రిడ్జిక్రింద రోడ్డుమీద–
అంకయ్య మరణం విని–
దోమలు సంగీతం పాడాయి–
ఈగలు నృత్యం చేశాయి–

———